
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 మార్చి 2025



టీటీడీకి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి -తిరుమల

టీటీడీ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్ (స్విమ్స్) కు రూ 1,00,01,116 కోటి విరాళం అందింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి లకు విరాళం డిడి ని అందజేశారు.



ఎనర్ టెక్ కాంనెట్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ అధినేత ఏ.వి రమణ రాజు ను చైర్మన్ అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీటీడీ స్కీమ్స్‌కు విరివిగా విరాళాలు పెరిగాయి.



'కూటమి' హయాంలో మళ్లీ తెరపైకి..!

స్కావెం(చ)ర్ కాలనీ

- 'పి4' పద్ధతిలో బహుళ అంతస్తులు
- పారిశుధ్య కార్మికుల తరలింపుకు యత్నం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్కావెంజర్ కాలనీలో 360 కుటుంబాలు ఉన్నాయి. వీరంతా ఎక్కువమంది కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంలో పనిచేసేవారే. వీరి పిల్లలు చదువుకోడానికి స్కూలును సైతం ఏర్పాటు చేశారు. దాదాపు వంద మంది పిల్లలు ఈ స్కూల్లో చదువుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం స్కావెంజర్ కాలనీలో ఉంటున్న పారిశుధ్య కార్మికులను తాత్కాలికంగా అక్కడనుంచి తరలించి, ప్రత్యామ్నాయం ఏర్పాటుచేసి, ఈ కాలనీలో బహుళ అంతస్తుల నిర్మాణం చేయాలని భావిస్తోంది. బహుళ అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్‌లు రెండు మూడు అంతస్తుల్లో నిర్మించి, ఆపైన పారిశుధ్య కార్మికులకు ప్లాట్లు కేటాయించాలని నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు రెండు మూడు రోజుల క్రితం సర్వే సైతం పూర్తయ్యింది. డిపిఆర్‌ను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే పారిశుధ్య కార్మికులు మాత్రం తమకు అక్కడే ఇంటి పట్టాలు ఇవ్వాలని, బహుళ అంతస్తుల నిర్మాణం అవసరం లేదని కొంతమంది అంటున్నారు. గత 70 ఏళ్లుగా అక్కడే ఉంటున్నామని, పట్టాలివ్వాలని ప్రభుత్వం దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లామని గుర్తు చేశారు. జన్మభూమి, రచ్చబండ కార్యక్రమాల్లోనూ వినతిపత్రాలు ఇచ్చామన్నారు. తమ పిల్లల్ని చదివించుకోవాలన్నా, పెళ్లిళ్లు చేసుకోవాలన్నా బ్యాంకుల్లో రుణం తీసుకోడానికి పట్టాలు లేకపోవడం ఆటంకంగా ఉందన్నారు. ఈ విషయాన్నే ఇటీవల సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రల్లోనూ పారిశుధ్య కార్మికులు సిపిఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవలనే కమిషనర్ మౌర్య సైతం నివాసం ఉంటున్న ఇళ్లకు అందమైన రంగులు వేయించడంతో చంద్రబాబే శభాష్ అని కొనియాడారు.

> చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ స్కావెంజర్ కాలనీ డెవలప్‌మెంట్ ప్రతిపాదన తెరపైకి వస్తుంది. ప్రస్తుతం పి4 పద్ధతిలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టాలని, ఇందుకుగాను ఇక్కడ నివసించే పారిశుధ్య కార్మికులను తాత్కాలికంగా తరలించేందుకు 'కూటమి' యత్నిస్తోంది. ఈ కాలనీలో గత 70 ఏళ్లుగా పారిశుధ్య కార్మికులు (గిరిజనులు) నివసిస్తున్నారు. దాదాపు మూడు నాలుగు తరాల వారు ఇక్కడ కాపురాలు ఉంటున్నారు. తిరుపతి నడిబొడ్డున ఉండే ఈ కాలనీని రీ డెవలప్‌మెంట్ పేరుతో అభివృద్ధి చేయాలని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ భావిస్తున్నారు. అయితే తమకు అక్కడే పట్టాలివ్వాలని, ఎక్కడికీ తరలించరాదని పారిశుధ్య కార్మికులు వేడుకొంటున్నారు.



'పీ'4 పద్ధతిలో రీ డెవలప్‌మెంట్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ విభాగంలో పనిచేసే కార్మికులు స్కావెంజర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. సర్వే నంబర్ 414 /2 ఏ లో3 ఎకరాల 50 సెంట్లు భూమి ఉంది. మరో సర్వే నంబర్లు 414/2 లో ఒక ఎకరా 11 సెంట్లు ఉంది. మొత్తం 4 ఎకరాల 61 సెంట్ల భూమి కలిగి ఉంది. ప్రస్తుతం ఈ భూమి ప్రైవేట్ మార్కెట్లో అయితే సుమారు 40 నుంచి 50 కోట్ల రూపాయలు విలువ కలిగి ఉంది. తిరుపతి నగరానికి నడిబొడ్డున ఈ స్కావెంజర్ కాలనీ ఉండడం వల్ల చాలా మంది ప్రైవేట్ వ్యక్తులు దీనిపై కన్ను పడిన సందర్భాలు ఉన్నాయి. ఇక్కడ పారిశుద్ధ కార్మికులు ఎక్కువగా నివాసం ఉండడంతో దీనికి తోడు వామపక్ష పార్టీలు పారిశుద్ధ కార్మికులకు మద్దతు ఉండడం వల్ల ఇక్కడ ప్రైవేట్ వ్యక్తులు గాని ఇతర కార్పొరేట్ కంపెనీలు గాని దీన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు చేసి విఫలమైన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ స్కావెంజర్ కాలనీ మున్సిపల్ కార్పొరేషన్ అధీనంలో ఉంది. మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్కావెంజర్ కాలనీ రీ డెవలప్మెంట్ పిఫోర్ పద్ధతి ప్రకారం చేయాలని భావిస్తున్నారు దీనికి సంబంధించిన పనులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చకచగా చేస్తున్నారు. ఓ ప్రైవేట్ ఏజెన్సీని పిలిచి స్కావెంజర్ కాలనీ రి డెవలప్మెంట్ చేయడానికి చర్యలు చేపడుతున్నారు. అయితే స్కాంజెర్ కాలనీలో ఉంటున్న పారిశుద్ధ కార్మికులు అందరూ అంగీకరిస్తేనే ఖాళీ చేసే అవకాశం ఉంది. లేదంటే వారు ఇక్కడి నుంచి ఖాళీ చేయించి మళ్లీ వారికి ప్లాట్లు ఇస్తారా? లేదా? అనేది వేచి చూడాల్సిందే. 2014లోనూ ఇదే ప్రయత్నం జరగ్గా మెజార్టీ కార్మికులు ఒప్పుకోలేదు. కొంతమంది సంతకాలు చేయగా వారికి పాడిపేట, తనపల్లి వద్ద ప్రభుత్వం నిర్మించిన గృహాల్లోకేటాయించారు. మిగిలినవారు తాము ఖాళీ చేసేది లేదని భీష్మించుకుని ఏడాది పాటు నిరసన తెలిపారు. వీరికి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, దళితసంఘాల మద్దతు లభించింది. దీంతో అప్పటి ప్రభుత్వం ఏమీ చేయలేక వెనుదిరిగింది. హైకోర్టు సైతం స్కావెంజర్ కాలనీవాసులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

పట్టాలిచ్చి ఇళ్లు కట్టివ్వాలి : వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి



స్కావెంజర్ కాలనీలో ఉంటున్న పేద గిరిజనులను రీ డెవలప్‌మెంట్ పేరుతో ఖాళీ చేయించొద్దు.. వారికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే రీడెవలప్‌మెంట్ యత్నం. మున్సిపల్ స్థలాలు కబ్జా అయిన వాటిని ఖాళీ చేయించి అభివృద్ధి చేయండి.. అంతే తప్ప అమాయక గిరిజనులకు అన్యాయం చేయొద్దు.

రీ డెవలప్‌మెంట్ చేస్తాం : మౌర్య, కమిషనర్



ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కావెంజర్ కాలనీలో ఉంటున్న గిరిజనులకు మంచి గహాలు నిర్మించి ఇచ్చేందుకు రీ డెవలప్మెంట్ చేయడానికి కషి చేస్తాం. దీనికి సంబంధించిన డీటెయిల్స్ ప్రాజెక్టును సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతాం. తుది నిర్ణయము ప్రభుత్వం తీసుకుంటుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన అన్ని వివరాలను సిద్ధం చేశాం. స్కావెంజర్ కాలనీ గిరిజనుల బతుకులు బాగుండాలనే ఉదేశ్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతుంది.

ఆలయాల నిర్మాణానికి ట్రస్టు ఏర్పాటు



శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

మనవడు దేవాన్ష్ పుట్టినరోజుకు రూ.44 లక్షలు విరాళం

వెంకటేశ్వర స్వామి ఆస్తులు కబ్జా చేస్తే దేవుడికే చెందుతాయి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని సిఎం చంద్రబాబునాయుడు కుటుంబం శుక్రవారం ఉదయం దర్శించుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి మొక్కులు చెల్లించారు. గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్న చంద్రబాబు కుటుంబం శ్రీ పద్మావతి అతిథిగృహంలో బస చేసింది. శుక్రవారం ఉదయం నారా చంద్రబాబునాయుడు, సతీమణి భువనేశ్వరి, కుమారుడు, ఎపిహెచ్‌ఆర్‌డి మంత్రి నారా లోకేష్, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్‌తో కలిసి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముందుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ముఖ్యమంత్రి ఆలయం లోనికి ప్రవేశించారు. మహాద్వారం వద్ద టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి, అర్చకులు కలిసి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద నమస్కరించిన అనంతరం ఆలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీ వకుళమాతను, ఆలయ ప్రదక్షణగా వచ్చి విమాన వెంకటేశ్వరస్వామి, సబేరా, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు. శ్రీవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రికి స్వామివారి శేష వస్త్రాన్ని అందించారు. తరువాత రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, విశ్వావసు నామ సంవత్సర పంచాంగం, డైరీ, క్యాలెండర్, అగరబత్తులు, పంచగవ్య ఉత్పత్తులను చైర్మన్, ఈవోలు అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, పనబాక లక్ష్మీ, ఎం.శాంతా రామ్, నన్నూరి నర్సిరెడ్డి, జీ. భాను ప్రకాష్ రెడ్డి, ఎస్ .నరేష్ కుమార్, పి.రామమూర్తి, సౌరభ్ హెచ్.బోరా, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు పాల్గొన్నారు.

అన్నప్రసాదాలు వడ్డించిన సిఎం కుటుంబ సభ్యులు

తిరుమల శ్రీవారి దర్శనానంతరం మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడుతూ టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని భక్తులు ముఖ్యమంత్రివర్యులు వద్ద సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం భక్తులతో కలిసి ఆయన భోజనం చేశారు. తమ మనువడు నారా దేవాన్ష్ 11వ పుట్టినరోజు సందర్భంగా తిరుమలలో ఒక్కరోజు అన్నప్రసాదానికి అయ్యే రూ.44లక్షల ఖర్చును ఆన్‌లైన్ ద్వారా విరాళంగా అందించారు.

వెంకన్న ఆలయాల నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు

'రాష్ట్రంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు లేవు. ఆయా గ్రామాల్లో వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం నిధులు సేకరించేందుకు ట్రస్టు ఏర్పాటు చేస్తాం. నాడు ఎన్టీఆర్ అన్నదానం, నేను ప్రాణదానం కార్యక్రమాలు ప్రవేశపెట్టాం. మూడవ కార్యక్రమంగా ఆలయాల నిర్మాణాలను తలపెడుతున్నాం. మాధవ సేవ కోసమే ఆలయాల నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. ట్రస్ట్‌కు వచ్చే నిధులు పగడ్బంధీగా ఖర్చు చేస్తాం. వెంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జా చేసినా వాటిని తిరిగి దేవుడికే చెందేలా చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వెంకటేశ్వర స్వామి తనకు పునర్జన్మ ప్రసాదించాడని అన్నారు.

హోటళ్లకు కేటాయించిన భూమి రద్దు చేస్తున్నాం

గత ఐదేళ్లలో తిరుమల పవిత్రత కోసం చాలా పోరాటాలు చేశాం. అందుకే అధికారంలోకి వచ్చాక వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచే ప్రక్షాళన చేపడతామని చెప్పి చేశాం. కొండకు ఆనుకుని ఉన్న ముంతాజ్, ఎమర్, దేవాలోక్ హొటల్స్‌కు అనుమతులు ఇచ్చి 35.32 ఎకరాలు కేటాయించారు. ఈ కేటాయింపులను రద్దు చేస్తున్నాం. ఏడు కొండలను ఆనుకుని ఎవరూ వ్యాపారం చేయడం, అపవిత్రం చేయడానికి వీల్లేదు. టీటీడీలో పని చేసే ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం...వేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడటానికి ఒకడుగు ముందుకేయాలి గానీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరించ వద్దు. దేశం, ప్రపంచంలో వేంకటేశ్వరస్వామి ఆస్తులను కాపాడటానికి కంకణం కట్టుకున్నాం.

శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుంచి బేగంపేట విమానాశ్రయానికి





తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు లభించింది. టిటిడి ఈ ఓ శ్యామలరావు, డీఐజీ షిమోషి బాజ్పాయ్, జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, భాను ప్రకాష్, కోనేటి ఆదిమూలం, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికష్ణ ఉన్నారు.

చంద్రబాబును కలిసిన రాజు యాదవ్

శ్రీవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని తిరుమల టిడిపి అధ్యక్షుడు సుద్దాల రాజు యాదవ్ కలిశారు. తిరుమల కొండపై నెలకొన్న పలు సమస్యలపై ఆయనకు విన్నవించారు. పద్మావతి అతిథి గహం వద్ద పోలీసులు అనుమతించకపోవడంతో వెలుపలే ఉన్న ఆయనను చూసి ముఖ్యమంత్రి కాన్వాయ్ ఆపేసి వెలుపలకు వచ్చి పార్టీ కార్యకర్తలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లిఖిత పూర్వకంగా ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. సమస్యలను టిటిడి అధికారులకి చెప్పి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ముంతాజ్ హోటల్ రద్దును స్వాగతిస్తున్నాం : వైసిపి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అలిపిరి సమీపంలో ముంతాజ్ హోటల్ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక పద్మావతిపురంలోని కరుణాకర్ రెడ్డి ఇంటి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధువులు, పీఠాధిపతులు చేసిన పోరాటానికి జడిసి అనుమతులను చంద్రబాబు రద్దు చేశారు.



జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

తనిఖీలు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి నగరంలో గత కొద్ది రోజులుగా బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్ పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. హెూటల్లు, పలు లాడ్జిలకు కూడా బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్ ఇటీవల వచ్చాయి. ఇప్పుడు ఏకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బాంబు బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అదనపు ఎస్పీ మనోహరాచారి, తిరుచానూరు సిఐ సునీల్ కుమార్, బాంబు స్క్వాడ్ అధికారులు కలెక్టర్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు.

మాజీ సీఎం వాటా ఎంత?: ఆర్సి మునికృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో ముంతాజ్ హెూటల్ నిర్మాణానికి అనుమతిని అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి ఎంత వాటా తీసుకొని ఇచ్చారని, ఆ విషయాన్ని మాజీ తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చెప్పాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల, తిరుపతి పవిత్రతను ఎప్పుడైనా కాపాడేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, అందుకే ముంతాజ్ హెూటల్ నిర్మాణానికి టిటిడి ద్వారా కేటాయించిన భూమిని వెనక్కు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారని, సాధువులకు భయపడి హెూటల్ నిర్మాణ అనుమతులు రద్దు చేశారని చెప్పడం హాస్యాస్పదమన్నారు.

ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు : ఎంఎల్ఎ పాశిం

ప్రజాశక్తి - గూడూరు టౌన్



ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా తొలికారు పంట బాగా పండిందన్నారు. రైతులు ప్రధానంగా కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్, బీపీటీ రకాల పంటలు సాగుచేశారు. ఆర్ఎన్ఆర్ విషయంలో కనీస మద్దతు ధరకు ఇబ్బంది లేనప్పటికీ కేఎన్ఎం కొంత ధర తగ్గినట్లు తెలుస్తోందన్నారు.బీపీటీ సాగు చేసిన రైతులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని దగ్గరలోని రైసుమిల్లుకు ట్యాగ్ చేసేశారన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ను రైతులు సంప్రదిస్తే ట్యాగ్ చేసిన రైసుమిల్లుకు ధాన్యం తోలేలా చర్యలు తీసుకుంటారన్నారు.ఎకరాకు 85 చొప్పున ఖాళీ గోతాలు అందుబాటులో ఉంచాం అన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతోందన్నారు. పొలాల్లో నుంచి ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించేందుకు అవసరమైన మేర లారీలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించాం..ఈ విషయంలో డీటీసీతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతున్నారు . ట్రాక్టర్లతో రైతులు ధాన్యాన్ని తో లు కుం టా మం టే అప్పటికప్పుడే జీపీఎస్ అమర్చి ఇబ్బంది లేకుండా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుని పుట్టికి రూ.19720 చెల్లిస్తుంటే రైతులు రూ.17 వేలుకు అమ్ముకోవాల్సిన అవసరం ఏముందన్నారు. ఏ రకం ధాన్యం ఎంత వచ్చినా మొత్తం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.కొనుగోలు ప్రక్రియ సరళతరం చేశారన్నారు. ధాన్యం అమ్ముకునే విషయంలో ఏ ఇబ్బంది వచ్చినా క్యాంప్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు అన్నారు.

మురికివాడల్లో దోమల స్వైరవిహారం : సిపిఎం

ప్రజాశక్తి - నాయుడుపేట

మున్సిపాలిటీలోని 18వ వార్డు భూపయ్యకాలనీ గిరిజన కాలనీలో మౌలిక వసతులు లేక, మురికివాడల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు అన్నారు. గురువారం సాయంత్రం సిపిఎం ప్రజాచైతన్య యాత్ర జరిగింది. కాలనీ పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి, గిరిజనులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గిరిజనులు ఉండేచోట ప్రభుత్వం ఏమాత్రం చిత్తశుద్ధితో అభివృద్ధి చేయడం లేదన్నారు. మురుగునీరు పోవడానికి కాల్వలు నిర్మించాలని, రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివకవి ముకుంద, భూపయ్యకాలనీ స్థానికులు వీరయ్య, అంకయ్య, కృష్ణ, శీనయ్య పాల్గొన్నారు.



ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మురికికాల్వల్లో బ్లీచింగ్‌చల్లుతున్న వి.నాగరాజు

అలిపిరి వద్ద అమినిటి కాంప్లెక్స్‌లు నిర్మించాలి

టిటిడి భూముల లీజు రద్దుపై సిఐటియు హర్షం



ప్రజాశక్తి - తిరుపతి సిటి

గత టిడిపి, వైసిపి ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కేటాయించిన 35 ఎకరాల భూముల లీజును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేయడం పై సిఐటియు హర్షం వ్యక్తం చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రకటనలో తెలిపారు.ఒబేరాయ్ సంస్థ తిరుపతి నగరంలో స్టార్ హెూటల్ ను నిర్మించాలనుకుంటే ప్రభుత్వం మరోచోట భూములను కేటాయించవచ్చని, టీటీడీ స్థలాలను కేటాయించాల్సిన అవసరం లేదని అన్నారు. అలిపిరి వద్ద బ.్ క్ ు ల సౌకర్యాలకై టిటిడికి భూముల అవసరం ఉండగా, ఏకపక్షంగా గత చంద్రబాబు ప్రభుత్వం దేవలోక్ పేరిట వెలసిన ఓ కంపెనీకి భూములు కేటాయించటాన్ని తాము తప్పు పట్టిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒబెరాయ్ గ్రూప్ వారికి స్టార్ హెూటల్ నిర్మాణం పేరిట భూములు కేటాయించటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకించామని గుర్తు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం స్వాధీనం చేసుకుంటున్న 35 ఎకరాల భూములలో భక్తులకు ఉపయోగపడే అమినిటీ (సౌకర్యాలు) కాంప్లెక్స్ ను నిర్మించాలని కోరారు. సామాన్య భక్తులకు వసతి దుర్భరంగా మారుతున్న నేపథ్యంలో డార్మెటరీలను పెద్ద సంఖ్యలో నిర్మించాల్సిన అవసరం ఉందని కందారపు మురళి ఆ ప్రకటనలో తెలిపారు.

వ్యకాసం ప్రధాన కార్యదర్శిగా దాసరి జనార్ధన్

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా నూతన కమిటీ ఎన్నికయ్యింది. అధ్యక్షులుగా తలారి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దాసరి జనార్ధన్, ఉపాధ్యక్షులుగా కె.గురవమ్మ, ఎన్.రమణయ్య, వందవాసి నాగరాజు, కార్యదర్శులుగా ముత్యాలయ్య, రాజగోపాల్, రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సుబ్బమ్మ, నారాయణ, శంకరయ్య, తిరుపాలు, సుబ్బయ్య, కత్తి గురవయ్య, బాల గురవయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, రమణయ్య, శ్రీనివాసులు, హరి, అముద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య భవన్‌లో నూతన కమిటీ ఎన్నికయ్యింది. వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తేవాలని దడాల సుబ్బారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించాలని, రోజువారి వేతనం రూ.600 చెల్లించాలని కోరారు. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ భూముల్లో జరిగిన అక్రమాలను బయట పెట్టి,అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వేసవిలో ఈ (కీర) జ్యూస్ తాగారంటే..!

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

మండుటెండలతో జనాలు అల్లడిపోతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే సహజసిద్ధంగా శరీరాన్ని చల్లగా ఉంచడంలో కీరదోసకు మించిన ఆప్షన్ మరొకటి లేదు. కీర ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి..

కీరదోస ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. పొటాషియం, మెగ్నీషియం సమద్ధిగా ఉండటం వలన, అధిక రక్తపోటుతో బాధపడేవారికి ఇది మంచి ఎంపిక. వేసవిలో ప్రతిరోజూ కీరదోస జ్యూస్ తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..

కీరదోస జ్యూస్ మంచి డీటాక్స్ డ్రింక్‌గా కూడా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ప్రతి ఉదయం ఈ కూరగాయల జ్యూస్ తాగడం వల్ల శరీరం నుంచి అవాంఛిత వ్యర్థాలను బయటకు పంపి శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇది అనేక వ్యాధుల నుంచి మనల్ని రక్షిస్తుంది. ప్రతిరోజూ కీరదోస జ్యూస్ తాగడం వల్ల శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. బరువు త్వరగా తగ్గుతుంది. బెల్లీ ఫ్యాట్ కూడా కరిగిపోతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఊబకాయం ఉన్నవారికి కీరదోస జ్యూస్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి, దీన్ని ప్రతిరోజూ తినడం కూడా చాలా మంచిది. వేసవి రోజుల్లో కీరదోస జ్యూస్



తాగడం వల్ల వేడి అనుభూతిని తగ్గి, శరీరం చల్లబడుతుంది. ఇది వడదెబ్బ నుంచి రక్షిస్తుందని నిపుణులు అంటున్నారు. అలాగే దీనిలోని పొటాషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. ఇది మన శరీరంలోని చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. అంతేకాకుండా ఇది గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది.

కీరదోసలో విటమిన్ కె ఎక్కువగా ఉంటుంది. ఇది గాయాల నుంచి రక్తస్రావం కాకుండా వెంటనే రక్తం గడ్డకట్టడానికి సహాయపడుతుంది. దీనిలోని మెగ్నీషియం బాగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. నిద్రలేమి సమస్యను తగ్గిస్తుంది. ఇది శరీరానికి విశ్రాంతిని ఇవ్వడమే కాకుండా జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది అజీర్ణం, గ్యాస్, మలబద్ధకాన్ని కూడా తగ్గిస్తుంది.

రెక్కాడినా.. డొక్కాడలే..!

- రెండు నెలలుగా అందని ఉపాధి హామీ కూలి
- ఆందోళనలో కూలీలు
- ఎండలోనే పని.. నిలువ నీడ లేదు





ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: గ్రామాల్లో నివసించే ప్రజలు ఎక్కువ శాతం మంది రైతు కూలీలుగా పని చేస్తున్నారు. చాలీ చాలని కూలీతో ఒక పూట తిని, తినక ఇబ్బంది పడుతున్నారు. దీంతో చాలావరకు గ్రామాల్లో నివసించే ప్రజలు బతుకుతెరువు నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారు.

వామపక్షాల చొరవతో ఉపాధి హామీ పథకం

ఎలాగైనా వీరి సమస్యను పరిష్కరించాలని కృత నిశ్చయంతో వామపక్ష పార్టీలు 2009వ సంవత్సరములో అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంది. గ్రామాల్లో నివసించే ప్రజలు బతుకు తెరువు కోసం వారు నివసించే ప్రాంతాల్లోనే 100 రోజుల పని దినాలను ప్రభుత్వం కల్పించి గ్రామ ప్రజలు వలసల బాటలు పట్టకుండా చేయడమే ఈ పథకం ఉద్దేశ్యం. మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ల కొరతతో కొన్ని పంచాయతీలలో ఉపాధి పనులు జరగడం లేదు. మొత్తం మీద 10,310 మంది జాబు కార్డులు కలిగి ఉన్నారు. వీరంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు. ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే డబ్బులతోనే వారి జీవనం గడుస్తోంది.

రెండు నెలలు గడచినా అందని కూలీ డబ్బు

ఉపాధి హామీ పనులకు సంబంధించిన కూలీ డబ్బు వారానికి ఒక రోజు వస్తే కూలీలకు కొంత ఉపశమనం కలుగు తుంది. కానీ కూలీలు పనిచేసిన డబ్బులు సుమారు రెండు నెలల కాలం గడుస్తున్నప్పటికీ రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకీ పెరుగుతున్న నిత్యవసర ధరలతో ఒకపక్క అల్లాడుతుంటే తిండి గింజలు కొనడానికి కూడా చేతిలో డబ్బులు లేక, వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించు కోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవి కాలంలో కూలీలకు టెంట్లు వేసిన దాఖలా లేదు

ఈ సంవత్సరం మార్చి నెలలోనే భానుడి ప్రతాపం ఎక్కువగా కనిపిస్తుంది. చెరువులు బాగా ఎండిపోయి భూమి గట్టి పడటంతో కూలీలు ఎండలో పనిచేయడం ఎంతో కష్టతరంగా మారింది. ఈ వేసవి కాలంలో ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాల్లో కూలీలకు సేద తీరటానికి టెంట్ వేయాల్సిన బాధ్యత సంబంధిత అధి కారులపై ఉంది. ఉపాధి పని చేసే ఏ ప్రాంతంలో కూడా టెంట్లు వేసిన పరిస్థితి ఎక్కడ కనబడటం లేదు.

అధికారులు స్పందించాలి

ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, బకాయిలు ఉన్న ఉపాధి కూలీ డబ్బులు వెంటనే వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలు సేద తీరటానికి టెంట్లు, తాగటానికి మంచి నీళ్ళు, మజ్జిగ ప్యాకెట్లు ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

కూలీ బకాయిలు వాస్తవమే

సుమారు 50 వేల పని దినాలకు సంబంధించి కూలీ డబ్బులు బకాయిలు ఉన్న విషయం వాస్తవమే. పై అధికారులకు నివేదికను పంపించి కూలి డబ్బులు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

- ఏ.పీ.వో దినేష్ కుమార్

గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో పక్కా గృహ నిర్మాణాలు చేపట్టిన బిసి, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు స్థానిక గృహ నిర్మాణ శాఖ ఏ.ఈ కిన్నెర గోపినాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన లబ్ధిదారులకు సూచనలు చేస్తూ, గృహ నిర్మాణం చేపట్టిన బిసి, ఎస్సీ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు 75 వేలను ప్రభుత్వం అదనంగా మంజూరు చేస్తుందన్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న పక్కా గృహాలకు ప్రభుత్వం ఒక లక్ష 80,000 రూపాయలను విడుదల చేసిందన్నారు. లబ్ధిదారులు సచివాలయాల్లో పత్రాలు సమర్పించి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా జాతీయ అటవీ దినోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: అంతర్జాతీయ అడవుల దినోత్సవాన్ని వృక్ష శాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు మానవాళికి ఎంత అవసరమో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగం ఇంచార్జ్ డా. జె. కోటీశ్వరరావు, ఎన్ పద్మావతి డా. పి. సుజన, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు టూ టౌన్‌లో శుక్రవారం డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచ్ జేజే రోస్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ.4.00 లక్షల నిధులతో 200 మీటర్ల మేరకు ఈ డ్రైనేజి నిర్మాణం చేపడుతున్నామన్నారు. అలాగే టూ టౌన్‌లో మిగిలిన అన్ని వీధులకు మురికి కాలువల నిర్మాణం త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవిందన్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు.. మంచి పోషకాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : చిరు ధాన్యాలు శరీరానికి మంచి పోషకాలు అని ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. కలీముల్లా పేర్కొన్నారు. స్థానిక తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అఖిల భారత జొన్న, చిరుధాన్యాల సమన్వయ పరిశోధన పథకం వారి షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక 2024-25 భాగంగా "చిరుధాన్యాలపై అవగాహన మరియు ప్రాసెసింగ్ యంత్రాల సందర్శన" అనే అంశం మీద ఎస్సీ కులానికి చెందిన 25 మందికి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతులకు మణినాయుడు నివాళి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కాటూరి గ్రామంలో వైఎస్ఆర్సీపీ కార్యకర్త మట్టే చెంచురాజు, తిరుమలశెట్టి చెంచులక్ష్మమ్మ గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న బుచ్చినాయుడు కండ్రిగ మడలం వైయస్సార్సీపి మండల కన్వీనర్ మణి నాయుడు ఇద్దరి మృతికి నివాళి అర్పించి, వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జొన్నల గోపాల్ రెడ్డి , ఎయంసి చైర్మన్ ఉగ్గుమూడి గురునాథం, వైస్ ఎంపిటిసి బాబు రెడ్డి ,మండల నాయకులు అశోక్, శరత్ యాదవ్, మురళి, హరి రెడ్డి, దంజేయులు, వెంకటేష్, కాళేష్, విఎస్ పురం సర్పంచ్ కృష్ణయ్య, వెంకట కృష్ణయ్య , పెనుబాకు వెంకటేష్, మిథున్ రెడ్డి ఫాలోవర్ కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

కళాశాలల్లో బయోటెక్ ఫెస్ట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల, టీటీడీ(ఎ), శుక్రవారం బయోటెక్నాలజీ విభాగం, ఐక్యూఏసి సహకారంతో ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమల నారాయణమ్మ అధ్యక్షతన "బయోటెక్ రెవల్యూషన్ ది నెక్స్ట్ ఫ్రాంటియర్ - ట్రాన్స్‌ఫార్మింగ్ సైన్స్ ఇనటు సొల్యూషన్స్" అనే అంశంపై బయోటెక్ ఫెస్ట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఐజర్ ప్రొఫెసర్ శివ కుమార్ ముఖ్య అతిథిగా, డాక్టర్ బుడోల్లాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బి. విశ్వనాథ్ గౌరవ అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు టి. హేమలత, కె. కుసుమ, భద్రమణి, ఉమారాణి, విభాగాధిపతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాలు

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : వెంకటగిరి మున్సిపాలిటీ పరిధి క్రాస్ రోడ్ నుండి కాశీపేట రాజా వీధి మీదుగా వెళ్ళు మెయిన్ రోడ్‌లో భాష్యం స్కూలు దగ్గర ఏర్పాటు చేసి ఉన్న స్పీడ్ బ్రేకర్ వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ బ్రేకర్ ఎత్తుగా ఉండడం వల్ల వాహనదారులు పడిపోతూ గాయాల పాలవుతున్నారు. అక్కడ స్పీడ్ బ్రేకర్ ఉన్నట్టు వాహనదారులకు తెలియడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ ఎత్తు తగ్గించి వైట్ రంగు పూయించి యాక్సిడెంట్లు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

గేట్ పరీక్షలో సత్తా చాటిన పూజ




ప్రజాశక్తి- వరదయ్యపాలెం : వరదయ్యపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని కల్లూరు పూజ ఇటీవల జరిగిన ఆల్ ఇండియా గేట్ ఎగ్జామ్‌లో సత్తా చాటింది. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పోటీ పరీక్షల్లో 911 ర్యాంక్ సాధించింది. ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రిలయన్స్ ట్రెండ్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రిలయన్స్ రిటైల్‌కు చెందిన దేశంలోనే అతిపెద్ద, వేగంగా అభివృద్ధి చెందుతున్న దుస్తులు, యాక్సెసరీస్, స్పెషాలిటీ చైన్ ట్రెండ్స్ తిరుపతిలో నాలుగవ స్టోర్‌ను శుక్రవారం ప్రారంభించింది. పట్టణంలోని వినియోగదారులు ట్రెండీ ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్ , ఫ్యాషన్ యాక్ససరీస్ ఇక్కడ లభ్యమవుతాయని నిర్వహకులు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో స్థానిక కామరాజు నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు (56) ద్విచక్ర వాహనంపై శుక్రవారం మధ్యాహ్నం వెళుతుండగా ఆటో ఢీకొని, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో ఆపకుండా ఉడాయించాడు. గాయాలైన వ్యక్తిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రుయా తరలించారు.

సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన జపాన్ బృందం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జపాన్‌కు చెందిన జే ఎఫ్ ఒజెర్లిన్ యూనివర్శిటికి చెందిన ప్రతినిధులు ఫుమెటిక్ నకముర అసోసిమ్ ట్ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం, టాకేరు తెరసావా స్టాఫ్ ఆఫీస్ ద ప్రెసిడెంట్ జపాన్, సీరుధాల్ జీ ఢిల్లీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. కళాశాలలోని మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, ఆడిటోరియం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలలో సందర్శించారు. అనంతరం కళాశాల చైర్మన్ అశోక్ రాజుతో, ప్రిన్సిపాల్ చంద్రశేఖరరెడ్డి, జనార్దన్ రాజు వైస్ ప్రిన్సిపాల్ గోపీనాథ్, హెచ్ఓడిలు అకాడమిక్ డీన్స్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌వారితో చర్చా గోష్టి జరిగింది.

గురుకుల ప్రవేశానికి 25 వరకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకులంలో దరఖాస్తులు స్వీకరణ గడువు మార్చి 25 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో బ్యాక్ లాగ్ క్రింద 6,7,8,9, తరగతుల్లో చేర గోరు వారు, అదేవిధంగా 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కొరకు వెబ్సైట్‌లో దరఖాస్తు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

ఘనంగా పాశిం జస్వంత్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తనయుడు జస్వంత్ పుట్టినరోజు సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగు యువత నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సందీప్, పప్పు యాదవ్, చరణ్, ఓం, అనిల్ తదితరులు పాల్గొన్నారు .

శ్రీ గాయత్రిలో ఈ- ప్రోగ్రామ్స్ ప్రారంభం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఇ-అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారిచే శుక్రవారం ఈ ఒలింపియాడ్, ఐకాన్ కరికులం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ స్కూల్ స్థాయి నుండి ఐఐటీ - నీట్ లక్ష్య సాధనకు హైదరాబాద్ ఈ అభ్యాస్ అకాడమీ సౌజన్యంతో ఈ ప్రోగ్రామ్స్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ అభ్యాస్ అకాడమీ జోనల్ మేనేజర్ సాయి రామ కృష్ణ, పాఠశాల అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు రఫీ, మస్తాన్బీ, సుప్రజ, రజిని, రాఘవయ్య, నాసీరా, భవానీ, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య ఉన్నతికి సోపానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రాథమిక స్థాయి నుండే పిల్లలు విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తే, వారికి ఉజ్వల భవిష్యత్తుతోపాటు, సమాజ శ్రేయస్సుకు దోహదపడతారని ఇండియన్ పోస్టల్ సర్వీస్ ఫౌండర్ కర్నూల్, వి.రాములు పేర్కొన్నారు. మహతి కళాక్షేత్రంలో శుక్రవారం ఫ్యూచర్ ఆన్ ప్రీ స్కూల్ ఆరవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ ఆన్ ప్రీ స్కూల్ అండ్ గ్లోబల్ ఐకాన్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ జి శశిరేఖ, అకడమిక్ డైరెక్టర్ రేవతి మురళీధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెము రైలు ఇంజన్‌లో సాంకేతిక లోపం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : చెన్నై నుండి- నెల్లూరు వెళ్లాల్సిన మెము రైలు ఇంజన్ సాంకేతిక లోపంతో శుక్రవారం దొరవారిసత్రం మండల పరిధిలోని కలంగుంట సమీపంలో ఆగిపోయింది. దీంతో బెంగళూరు నుండి జోద్ పూర్ వెళ్లే సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు దొరవారిసత్రం స్టేషన్లో ఆగిపోయింది. రెండు గంటలపైన ఆగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు పలు అవస్థలకు గురయ్యారు. చిన్నపిల్లలు, వద్ధులు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. మెమో రైలుకు వెళ్లాలని నాయుడుపేట రైల్వే స్టేషన్లో ఎదురుచూసిన అనేకమంది ప్రయాణికులు వేచి చూసి విషయం తెలుసుకొని వెళ్లిపోయారు. అడవి మార్గంలో మెమో రైలు రెండు గంటల పైబడి నిలిచిపోవడంతో రైల్వే అధికారులు తక్షణ చర్యలుగా మెమో ను ట్రాక్ నుండి తొలగించి ఆగిపోయిన రైళ్లను పునరుద్ధరించారు.

రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు మంజూరు



ప్రజాశక్తి - సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మండల పరిధిలోని పులికాట్ తీర ప్రాంత గ్రామాలైన కొరిడి, పేర్నాడు, వేనాడు గ్రామాల రోడ్డు నిర్మాణాలకు అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ను కోరారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం పవన్ కు వినతి పత్రం అందించారు. అలాగే రోడ్డు నిర్మాణాలకు అవసరమైన నిధులు సమకూర్చాలని, వేసవికాలం సందర్భంగా నీటి ఎద్దడి లేకుండా తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు.

పాత సామాన్ల షాపు తరలించండి





ప్రజాశక్తి - నాగలాపురం : నాగలాపురం పట్టణం వి.కె.యం వీధిలో పాత సామాన్లు విక్రయించే వ్యాపారి వల్ల చుట్టుపక్కల ఉన్న ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలలోని పాత ఇనుప సామాన్లను, ప్లాస్టిక్స్ సామాన్లు కొనుగోలు చేసి ఇంటి ముందర వేసుకుని వ్యాపారం చేస్తున్న వ్యక్తి ఆ ప్లాస్టిక్ సామాన్లలో నీరు నిల్వ ఉండి దోమలు, విష పురుగులు చనిపోయి వాటిలో వచ్చే దుర్వాసనతో చిన్న పిల్లలు, వృద్ధులు, చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అతనికి ఇబ్బంది తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఈ వ్యాపారి దుకాణం పక్కనే ఓ ప్రైవేటు పాఠశాల ఉంది. మధ్యాహ్నం పూట విద్యార్థులు భోజనం చేయాలన్నా వాసన భరించలేక అవస్థ పడుతున్నారు. ఈ పాత సామాన్లు వేరే ప్రాంతానికి తరలించడానికి ప్రధాన రోడ్డు మార్గంలో లారీని గంటల తరబడి నిలబెట్టి సామాన్లు ఎక్కిస్తుండడంతో ద్విచక్ర వాహనాలు దారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు రోడ్డుపై వెళ్లేవారిపై ఆ పాత సామాన్లు పడిన సందర్భాలున్నాయి. గాయాలైన వ్యక్తులు వ్యాపారిని అడగగా మీరేం చేసుకుంటారో చేసుకోండని దురుసుగా సమాధానం చెబుతున్నాడని చుట్టుపక్కలవారు తెలిపారు. పంచాయతీ అధికారులు ఈ పాత ప్లాస్టిక్ సామాన్లు విక్రయించడానికి, లేదా నిల్వ చేయడానికి అనుమతులు ఇచ్చారా లేదాని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తూ, ఈ అపరిశుభ్రతను ఎందుకు ప్రశ్నించడం లేదని స్థానికులు సందేహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పాత సామాన్ల అంగడిని ఊరు బయట నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సెంచురీ మ్యాట్రెస్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్ ప్రారంభం



నూతన స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మంగళం మార్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రముఖ మ్యాట్రెస్ కంపెనీ సెంచరీ వారి ఎక్స్ పిరియన్స్ స్టార్‌ను శుక్రవారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలోనే పేరొందిన సెంచరీ మ్యాట్రెస్ ఒత్తిడి లేని ఆరోగ్యకరమైన నిద్రను అందించడానికి ప్రత్యేకమైన టెక్నాలజీతో మ్యాట్రెస్స్ తయారు చేస్తోందన్నారు. స్టోర్ ప్రొప్రైటర్ నాగసాయి మాట్లాడుతూ ప్రజలు కొత్త స్టోర్ ద్వారా అందించే ఆఫర్లను అందిపుచ్చుకోవాలన్నారు. లాంచింగ్ ఆఫర్లుగా 1 గ్రాము బంగారు నాణెం, 1.5 - టన్ను సామర్థ్యమున్న 3-స్టార్ ఎయిర్ కండీషనర్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెంచురీ మ్యాట్రెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలాని, ఎడిఫై స్కూల్ డైరెక్టర్, ప్రణీత్ ఫౌండేషన్ చైర్మన్ ప్రణీత్ పెనుమడు, టిటిడి ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షులు ఆర్.కిషోర్ కుమార్, ఆరణి మదన్, జనసేన తిరుపతి పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, రాజేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలను సమగ్రంగా తనిఖీ చేయాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యా ప్రమాణాలను గాలికొదిలేసి, ధనార్జనే ధ్యేయంగా, అక్రమాలకు పాల్పడుతున్న కళాశాలలను సమగ్రంగా తనిఖీ చేయాలని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. వృత్తి విద్యా కోర్సులకు అనుమతులు ఇచ్చే వివిధ సంస్థలు తనిఖీ చేయకపోవడం వల్లనే యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పుత్తూరు పట్టణానికి చెందిన ఒక కళాశాల యాజమాన్యం ఒకే భవనాన్ని చూపించి, నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాలైన వృత్తి విద్యా కోర్సులకు అనుమతులు పొంది, తరగతులు నిర్వహిస్తోందని, ఇటువంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.

వైసీపీ సమన్వయ కమిటీ ఏర్పాటు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి వైసీపీలో సీనియర్స్, జూనియర్స్ మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు కొత్తగా ఒక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ పార్టీ ఇన్చార్జ్ అభినయ రెడ్డి తెలిపారు. నగర అధ్యక్షులు మల్లం రవిచంద్ర రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఈ కమిటీలో మొత్తం నలుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. ఈ కమిటీ ద్వారా కార్యకర్తల హక్కులు, అభిప్రాయాలు గౌరవించబడతాయని, పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతుందని ఆశిస్తున్నామన్నారు. ఈ కమిటీలో తిరుపతి వైసిపి నగర అధ్యక్షులు, సీనియర్ నాయకులు సాకం ప్రభాకర్, షఫీ అహమాద్ ఖాద్రీ, నవీన్ భృంగి సభ్యులుగా ఉంటారని తెలిపారు.

12 మంది పోలీసులకు సేవా పతకం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రతిష్టాత్మకమైన సేవా పతకాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. తిరుపతి జిల్లాలో మొత్తం 12 మంది పోలీస్ సిబ్బంది పతకాలను అందుకోనున్నారు. వెంకట్రావు అదనపు ఎస్పి పరిపాలన, వినోద్ కుమార్ ఎస్ ఐ సైబర్ క్రైమ్, మునిరత్నం రెడ్డి ఏఎస్ ఐ వెస్ట్ పోలీస్ స్టేషన్, శివకుమార్ రెడ్డి ఏఎస్ ఐ తడా పిఎస్, భక్తవత్సలం రాజు ఏఎస్ఐ పిచ్చాటూరు పిఎస్, ఏడుకొండలు ఏఆర్ హెచ్ సి, బ్రహ్మ నాయక్ ఏఆర్ హెచ్ సి, రమేష్ బాబు ఏఆర్ హెచ్ సి, ప్రసన్నాంజనేయలు ఏఆర్ హెచ్ సి, మల్లికార్జున రావు ఏఆర్ హెచ్ సి, నిర్మలా వెస్ట్ పిఎస్ హెచ్ సి, భాస్కర్ ఏఎస్ ఐ అలిపిరి పిఎస్‌లు పతకాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు వారిని అభినందించారు.

ప్రశాంతంగా ఆంగ్ల పరీక్ష

కాపీ కొడుతున్న విద్యార్థి డీబార్

ప్రజాశక్తి - తిరుపతి: పదో తరగతి పరీక్షల్లో ముడోరోజైన రోజైన శుక్రవారం ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. తిరుపతి జిల్లాలో పరీక్షకు మొత్తం 26,897 మంది హాజరు కావాల్సి ఉండగా, వారిలో 26,617 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయినట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కేవిఎన్ కుమార్ తెలిపారు. అధికారుల తనిఖీలో ఒక్క విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా డీబార్ చేశామన్నారు.

తిరుపతి నగరవనంలో చిరుత సంచారం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి కపిలతీర్థం సమీపంలోని అటవీశాఖకు చెందిన నగరవనంలో చిరుతపులి శుక్రవారం సంచరించింది. ఉదయం 10 గంటల సమయంలో ఓ చిన్న బ్రిడ్జిపై సేదతీరుతూ కనపడటంతో నగర వనానికి వచ్చిన సందర్శకులు భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. చిరుత గమనాన్ని గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామని అటవీ శాఖ అధికారి రమేష్ తెలిపారు. పులి సంచారం నేపథ్యంలో నగరవనాన్ని తాత్కాలికంగా మూత వేస్తున్నామని, పరిస్థితులు చక్కదిద్దాక తిరిగి సందర్శ కులను నగర వనంలోకి అనుమతి ఇస్తామని తెలిపారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: మండల పరిధి, మేళచూరులో ఒక మామిడి తోటలో శుక్ర వారం 3 లక్షల రూపాయల విలువైన ఎర్రచం దనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. అటవీ శాఖ అధి కారి లోకేష్ తెలిపిన వివరాల మేరకు మేళచూరు, మామిడి తోటలో ఎర్రచందనం దుంగలు నిల్వ ఉంచినట్లు సమాచారం అందటంతో, సిబ్బందిని పంపి అనుమానితులను పట్టుకోవడానికి ప్రయత్నించగా ఐదు మందిలో ముగ్గురు వ్యక్తులు పారిపోయారన్నారు. మిగిలిన ఇద్దరిని విచారించి వారి వద్ద నుండి 131 యొక్క కిలోల ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పారిపోయిన వ్యక్తులను కూడా త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

పుచ్చ సాగు.. బహు బాగు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఈ ఏడాది విస్తారంగా పుచ్చపంట సాగులోకి వచ్చింది. రైతులు కూడా ఈసారి పుచ్చ సాగుకే మొగ్గు చూపారు. అయితే పంట కూడా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం, మరో వైపు గిట్టుబాటు దర ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మల్చింగ్ విధానంలో పండ్ల తోటలు సాగు చేస్తే చాలా వరకు పెట్టుబడి తగ్గుతుంది. సత్యవేడు నియోజకవర్గవ్యాప్తంగా 1.450 ఎకరాల్లో ఈ ఏడాది పుచ్చ పంటను సాగు చేశారు. మల్చింగ్, డ్రిప్ పద్ధతిలో సాగు చేశారు. పాలథీన్ షీట్లను భూమిపై కప్పి పంటను సాగు చేసే విధానాన్ని మల్చింగ్ అంటారు. పంటకు నీటి సరఫరా కోసం డ్రిప్ పద్ధతిలో తుంపర్ల ద్వారా సాగు నీరు అందే విధంగా రైతులు సిద్ధం చేసుకున్నారు. మల్చింగ్ విధానంలో పంట సాగు చేయడం వల్ల కలుపు మొక్కలు తొలగించే పరిస్థితి నుంచి రైతు లకు విముక్తి లభిస్తుంది. పుచ్చ పంట సాగులో ఎకరా పంటకు 15 టన్నులకు పైగా దిగుబడి వస్తోంది. టన్ను రూ.10 వేలు నుం లి రూ. 13 వేల వరకు ధర పలుకుతుండడంతో ఈ ఏడాది రైతుకు పుచ్చ పంట సాగుతో ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.





పుచ్చ పంటను మల్చింగ్ విధానంలో సాగు చేసేందుకు రైతులు ఈ ఏడాది ప్రత్యే కంగా ఆసక్తి చూపారు. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలో 1450 ఎకరాల్లో మల్చింగ్ విధానం ద్వారా ఈ ఏడాది పుచ్చ పంటను సాగైంది. ఈ విధానంతో దిగుబడి ఎక్కువగా రావడంతో పాటు పెట్టుబడులు కూడా 40శాతం వరకు తక్కువ అయ్యాయి. హెక్టారుకు రూ.16 వేల సబ్సిడీ అందజేస్తాం. క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగాహన కల్పించడానికి ప్రత్యేక కృషి చేస్తున్నాం.

–ఉద్యానశాఖ, అధికారిని యామిని

ఆంగ్ల విభాగంలో జాతీయ సదస్సు ప్రారంభం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు "రీసెంట్ డిసిప్లినరీ ట్రెండ్స్ ఇన్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్" అనే అంశం పైన శుక్రవారం సావేరి సమావేశ మందిరంలో ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఆచార్య బి.తిరుపతిరావు, విశిష్ట అతిథి ఆచార్య మధురాంతకం నరేంద్ర ఇంచార్జి డీన్ ఆచార్య.విజయలక్ష్మి, పిఎమ్ ఉషా కోఆర్డినేటర్ ఆచార్య వాణి, సెమినార్ కన్వీనర్ ఆచార్య.వై. ఎస్.శారద, కో కన్వీనర్ ఆచార్య నిర్మల, పరిశోధక విద్యార్థినులు పాల్గొన్నారు.

సింహగర్జన వాయిదా



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి వేదికగా రాయలసీమ మాలల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మాలల సింహ గర్జన సభ అనుమతి రద్దు చేయడంతో వాయిదా వేశామని, తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని రాయల సీమ జేఏసీ గౌరవాధ్యక్షులు అశోక రత్న తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో దళిత నాయకులు జయరాం, దాము, రాజ కుమార్, మురళి, సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

జ్యోతిష్య శాఖ ఈక్వినాక్స్ షాడో డే నిర్వహణ



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం జ్యోతిష శాఖ ఆధ్వర్యంలో ఈక్వినాక్స్ షాడో దినాన్ని శుక్రవారం వర్సిటీలో నిర్వహించారు. వర్సిటీ కులపతి ఎన్.గోపాలస్వామి, విసి ఆచార్య జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు, జ్యోతిష హెచ్ఓడి ఆచార్య కృష్ణసార్ఘా, డా.చిత్తరంజన్ నాయక్, పీఆర్వో ప్రొ.వి.రమేష్ బాబులు పాల్గొని మన ప్రాచీన సంస్కృత పండితులు సైన్స్‌లో పరిశోధనలు చేసిన తీరును పరిశీలించారు.

మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఈరోజు ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ మరియు ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ మెగా క్యాంప్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ తిరుపతి ప్రెసిడెంట్, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసునిసాబేగం అధ్యక్షతన జరిగింది. ఇంపాక్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ .గంపా నాగేశ్వరరావు జన్మదినం , ఇంపాక్ట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ శిబిర నిర్వహణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. తిరుమల నారాయణమ్మ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరం అన్నారు. కళాశాల మరియు వసతి గృహంలో ఉండే విద్యార్థినుల వద్దకే వైద్యులు వచ్చి పరీక్షల నిర్వహించి, వైద్యం అందించడం చాలా అభినందనీయం అన్నారు. ఈ ఉచిత వైద్య సేవల వలన విద్యార్థినులు తమ ఆరోగ్యం పై అవగాహన పొందారన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. కృష్ణవేణి మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేయటం అభినందనీయం అన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ .దివ్యవాణి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యులు కూడా ఈ శిబిరంలో పాల్గొన్నారని అన్నారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ ప్రెసిడెంట్ మరియు ఉయ్ సపోర్టు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నీసా బేగం మాట్లాడుతూ విద్యార్థినిలు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవుతూ ఉండటం సహజం అన్నారు. వాటిని దూరం చేయటానికి, ఆరోగ్యాన్ని అందించడానికి ఈ వైద్య శిబిరాన్ని తమ సంస్థల ద్వారా నిర్వహించామన్నారు.ఈ వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్. రాఘువాచారి, మెడిగో వైద్య కళాశాలలో విధులు నిర్వహించే డాక్టర్. పోలి విద్యా రెడ్డి , డెంటిస్ట్ డాక్టర్. శిరీష, ఆయుర్వేద వైద్యులు జ్యోత్స్న, న్యూరాలజిస్ట్ డాక్టర్.విన్నూత్న, వెల్నెస్ కోచ్ వసుధ, ఇంపాక్ట్ సభ్యులు నాదముని, శ్రీధర్ విఠల, .సుజాత, కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

కవర్లతో నాణ్యమైన మామిడి దిగుబడి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి) రైతులు నాణ్యమైన పండ్లు పొందాలంటే ప్రతి కాయకు కవర్లు తొడగాల్సిందేనని చంద్రగిరి ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ తెలిపారు. ఆమె చంద్రగిరి మండలం తొండవాడ గ్రామానికి చెందిన వెంకట్రామి రెడ్డి మామిడి తోటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మామిడి సాగులో కాయలకు కవర్లు కట్టే విధానాలను సూచించారు. కవర్లు రాయితీలో లభిస్తాయని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకూరాలు లత, రైతులు పాల్గొన్నారు.



మామిడికాయలకు కవర్లు అమర్చుతున్న దృశ్యం



రోడ్డు భద్రత నియమాలు పాటించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాల ని గూడూరు ఒకటవ పట్టణ సిఐ శేఖర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ కూడలి వద్ద ఆటోవాలాలకు అవగాహన కల్పించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

పన్నులు చెల్లించండి

నగర అభివృద్ధికి సహకరించండి : కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు అన్ని పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 సంవత్సరానికి ఇంటి పన్నులు, నీటి పన్నులు, భూగర్భ డ్రైనేజి పన్నులు మరియు ఖాళీ జాగా పన్నులు బకాయిలు వున్న యజమానులు మూడు రోజుల్లోపు చెల్లించాలని తెలిపారు. బకాయిలు చెల్లించని యెడల నీటి కొళాయి కనెక్షన్, విద్యుత్ శాఖ వారి ద్వార మీ యొక్క ఇంటి కరెంటు కన్నెక్షన్లు డిస్కనెక్ట్ చేయించబడునని తెలిపారు. ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధి కి సహకరించాలని కమిషనర్ ఆ ప్రకటనలో ప్రజలను కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన టిడిపి ముస్లిం మైనారిటీలు



ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక గేట్ పుత్తూరు చెందిన తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకులు, నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆదివారం గేటు పుత్తూరులో జరుగనున్న పేదలకు చీరల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానం పలికారు.

ప్రధానోపాధ్యాయుడు మృతి



సోమనాథ్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) చంద్రగిరి మండలం, చిన్న రామాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమనాథ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు కిడ్నీలు చెడిపోవటంతో రెండు సంవత్సరాలుగా డయాలసిస్ చేయించుకుంటు న్నారు. మండల విద్యాశాఖ అధికారిణి లలిత కుమారి, రంగంపేట సి ఆర్ సి హెచ్ ఎం మదన్మోహన్, యూటీఎఫ్ నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆయన మృతికి నివాళులర్పించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం : జిల్లాలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ చేపట్టాలని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎస్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని సొరకాయల పాళ్యం పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

ఎస్వీయూలో ఇంజనీరింగ్ గోష్టి



ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం, సివిల్ ఇంజనీరింగ్ అసోసియేషన్ సంయుక్తంగా విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యం వెలికితీయుటకు రెండు రోజుల పాటు "క్రెడర్స్ 2025" గోష్టి (సింపోజియం)ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు ఆచార్య జి. శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంద్ర అమరేంద్ర కుమార్, విభాగ అధ్యక్షురాలు సుధారాణి, జాతీయస్థాయిలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకూ చెందిన 250 మంది సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.